



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలో వర్షాల పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, డీఆర్ఓ దయానిధి



చోడవరంలో వర్షం



రావికమతం మండలం మత్స్యపురం పొలాల్లో నిలిచిన వర్షం నీరు

కుండపోత!

వాయుగుండం ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు
- భారీ వర్షాల హెచ్చరికతో అధికారులు అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్
- మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వాయువ్య బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో జిల్లా అంతటా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురవగా మరికొన్నిచోట్ల కుండపోత వర్షం కురిసింది. ముసురు వాతావరణం నెలకొనడంతోపాటు లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అవడంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. జిల్లాలో శనివారం కూడా పలు చోట్ల వర్షాలు విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలు చెక్‌డ్యామ్‌లు, చెరువుల్లోకి వరద నీరు చేరుతోంది. ఇప్పటికే గోతులతో అధ్వానంగా వున్న ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

తీవ్ర అల్పపీడనం వాయుగుండగా మారడం, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో, నీటిపారుదల శాఖ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సిబ్బందిని నియమించి ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. మండలాల నుంచి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందిని ఉంచారు.



చీడికాడ మండలం వరహాపురం సమీపంలో రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మొండిగెడ్డ

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు శనివారం సెలవు ప్రకటించారు. అధిక వర్షాల నేపథ్యంలో మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు విజయకృష్ణన్ సూచించారు. మండల అధికారులతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు, నష్టాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజులపాటు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, విపత్కర పరిస్థితులు ఏర్పడితే అవసరమైన సహాయక చర్యలు చేపపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న 24 గంటల్లో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశాలువున్నందున లోతట్టు ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని కలెక్టరు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని ఆదేశించారు. నిత్యావసర సరకులు, గ్యాస్, వంటనూనె తగినంత నిల్వ చేసుకోవాలని పౌర సరఫరా శాఖాధికారులకు సూచించారు. వర్షాల కారణంగా తాగునీటి వనరులు కలుషితం అయ్యే అవకాశం వుందని, అందువల్ల ... మిగతా 6వ పేజీలో

ఎలమంచిలిలో పొంగిన శేషుగెడ్డ

- పాత హైవే మీదుగా వరద ఉధృతి
- వాహనాల రాకపోకలకు అంతరాయం



పాత జాతీయ రహదారి పైనుంచి ప్రవహిస్తున్న శేషుగెడ్డ వరద నీరు

ఎలమంచిలి, ఆగస్టు 31: ఎలమంచిలి, చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో శేషుగెడ్డ వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నది. దీంతో పాత జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎలమంచిలికి పశ్చిమంగా వున్న అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు శేషుగెడ్డ ద్వారా శారదా నదిలోకి చేరుతుంది. వరద ఉధృతి పెరగడంతో పాత జాతీయ రహదారి మీద నుంచి నీరు ప్రవహిస్తున్నది. దీంతో మునిసిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌ను రప్పించి గెడ్డలో చెత్తను తొలగించే పనులు చేపట్టారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. శేషుగెడ్డను ఆధునీకరించకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వరద నీరు పొంగి పాత జాతీయ రహదారి మీదుగా ప్రవహిస్తున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌లు, ఫోన్ నంబర్లు

కలెక్టర్ కార్యాలయం, అనకాపల్లి: 08924-222888, 08924-226599
ఆర్డీఓ కార్యాలయం, అనకాపల్లి: 9491998293
ఆర్డీఓ కార్యాలయం, నర్సీపట్నం: 7075356563
ఈఈ, నీటిపారుదల శాఖ కార్యాలయం, చోడవరం: 08934-245009, 9849553188
ఈఈ, నీటిపారుదల శాఖ కార్యాలయం, నర్సీపట్నం: 8978542297

రాంబిల్లి మండలంలో అత్యధిక వర్షపాతం

జిల్లాలో వివిధ మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు కురిసిన వర్షపాతం వివరాలు.. రాంబిల్లి మండలంలో అత్యధికంగా 119.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగిలిన మండలాల వారీగా పరిశీలిస్తే.. పరవాడలో 109.8, మునగపాకలో 106, అనకాపల్లిలో 100.4, అచ్యుతాపురంలో 92.3, నక్కపల్లిలో 91.6, ఎలమంచిలిలో 91, పాయకరావుపేటలో 84.2, ఎస్.రాయవరంలో 75.8, బుచ్చెయ్యపేటలో 70.2, కె.కోటపాడులో 62.7, సబ్బవరంలో 61.9, కశింకోటలో 60.9, రావికమతం, దేవరాపల్లిల్లో 60, గొలుగొండలో 56.7, నాతవరంలో 56.4, కోటవురట్లలో 52.6, రోలుగుంటలో 49.6, మాకవరపాలెంలో 46.4, చీడికాడలో 44.6, చోడవరంలో 43.2, మాడుగులలో 41, నర్సీపట్నంలో 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వాడీ వేడిగా పట్నం కౌన్సిల్ సమావేశం

పింఛన్ల తొలగింపుపై వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, టీడీపీ కౌన్సిలర్ పద్మావతి వాగ్వాదం

- రాజకీయ కక్షతోనే రద్దు చేశారని మాజీ చైర్‌పర్సన్ ఆరోపణ
- కూటమి ప్రభుత్వంలో ఇటువంటివి జరగవన్న టీడీపీ సభ్యురాలు పద్మావతి
- స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరిస్తానని భరోసా
- పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని ధ్వజం
- చెత్త వాహనాల ఆయిల్ బిల్లుల్లో అవినీతి జరుగుతోందని జనసేన కౌన్సిలర్ సౌజన్య ఆరోపణ



మునిసిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, ఆగస్టు 31: స్థానిక మునిసిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. రాజకీయ కక్షతో కొంతమంది సంక్షేమ పెన్షన్లను రద్దు చేశారని వైసీపీకి చెందిన మాజీ చైర్‌పర్సన్ ఆరోపించగా, కూటమి ప్రభుత్వంలో అర్హుల పెన్షన్లు తీసేయదని టీడీపీకి చెందిన కౌన్సిల్ చింతకాయల పద్మావతి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ అయ్యన్న దృష్టికి తీసుకువెళ్లి పెన్షన్లను పునరుద్ధరించే బాధ్యత తీసుకుంటానని పద్మావతి హామీ ఇచ్చారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో తొలుత ఆరు అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టారు. 26వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో ముగ్గురు కమిషనర్లు, ఇద్దరు చైర్‌పర్సన్‌లు మారారని, తన వార్డులో ఒక్క పని కూడా చేయించుకోలేకపోయానని అన్నారు. వీధి లైట్లు పని చేయడం లేదని, వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త పేరుకు పోయి ఉంటుందని, దోమల నివారణకు ఫాగింగ్ జరగడం లేదని, దీంతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారని చెప్పారు. జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య మాట్లాడుతూ, చెత్త రవాణా చేసే వాహనాల ఆయిల్ బిల్లుల పేరుతో ప్రతి నెలా రూ.2 లక్షలు అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. చెత్త వాహనాల ఆయిల్ ఖర్చులు లెక్కలు తేల్చకపోతే వచ్చే కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకుంటానని హెచ్చరించారు. పోడియం మీదకు వెళ్లి చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మికి తన వద్ద ఉన్న వివరాలను ... మిగతా 6వ పేజీలో

94.44 శాతం మందికి పింఛన్లు

- జిల్లాలో 2,61,800 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులు
- తొలిరోజు 2,47,167 మందికి సొమ్ము అందజేత



పాయకరావుపేటలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం పండుగలా సాగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో పింఛన్‌దారులకు శనివారమే సొమ్ము పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. కలెక్టరు విజయకృష్ణన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సచివాలయాల సిబ్బంది, ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. జిల్లాలో మొత్తం 2,61,800 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులు వుండగా శనివారం సాయంత్రం వరకు 2,47,167 (94.44 శాతం) మందికి సొమ్ము అందజేశారు. మిగిలిన వారికి సోమవారం పింఛన్లు అందజేస్తామని అధికారులు వెల్లడించారు. కాగా శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గొలుగొండ మండలం చీడిగుమ్మలలో, హోం మంత్రి వంగలపూడి అనిత ... మిగతా 6వ పేజీలో

గోవాడ షుగర్స్ భవిష్యత్తుపై ఎమ్మెల్యేలతో సమావేశం

ఇథనాల్ ప్లాంట్ నిర్వహణపై నిర్ణయం

- చోడవరం, మాడుగుల ప్రాంతాల్లో ఎస్‌ఈజడ్‌లు
- త్వరలో భూములు గుర్తింపు
- సబ్బవరం నుంచి చోడవరం మీదుగా హైవే నిర్మాణం
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో బీఎన్ రోడ్డు సంక్లిష్టం
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్. పక్కన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఆగస్టు 31: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవితవ్యంపై రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్, ఫ్యాక్టరీ పరిధిలోని చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించనున్నట్టు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. శనివారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీ మనుగడ కోసం ఏర్పాటు చేసే ఇథనాల్ ప్లాంట్‌ను ఏ విధంగా నిర్వహించాలనే అంశంపైనా చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. చోడవరం, మాడుగుల ప్రాంతాల్లో ప్రత్యేక ఆర్థిక మండలాల (ఎస్‌ఈజడ్) ఏర్పాటు కోసం భూముల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కావలసి ఉందని, అయితే తహసీల్దార్ల బదిలీల వల్ల జాప్యం జరిగిందని, త్వరలోనే స్థలాల గుర్తింపు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టామని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

చోడవరం మీదుగా హైవే నిర్మాణం

చోడవరం, మాడుగుల, నర్సీపట్నం ప్రాంతాల్లో రహదారి సమస్యలు తీర్చడంతోపాటు, పరిశ్రమల స్థాపనకు దోహదపడే విధంగా సబ్బవరం నుంచి చోడవరం, నర్సీపట్నం మీదుగా తుని వరకు జాతీయ రహదారి నిర్మాణానికి ప్రయత్నిస్తున్నామని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టేలా త్వరలోనే అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

బీఎన్ రోడ్డు పనులపై త్వరలో సమావేశం

చోడవరం నుంచి నర్సీపట్నం వరకు బీఎన్ రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనుల్లో ప్రతిష్టంభన నెలకొందని, వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లనే ఈ పనుల విషయంలో ముందుకు వెళ్లలేకపోతున్నామని ఎంపీ రమేశ్ అన్నారు. న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులు పూర్తి చేయడానికి కృషిచేస్తున్నామని ఆయన తెలిపారు. అంతవరకు ప్రజలు ఇబ్బంది పడకుండా మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులకు సూచించామని, వర్షాలు తగ్గిన తరువాత మరమ్మతు పనులు చేపడతారని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, షుగర్స్ ఎండీ వి.సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ నాయకులు ఏడువాక లక్ష్మణకుమార్, సేనాపతి శ్రీనివాసరావు జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, అల్లం రామప్పారావు, ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు పాల్గొన్నారు.

15 మంది సీఐల బదిలీ ▸ విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు -వార్త 5వ పేజీలో

పెందుర్తి ఎంఈవో-1

సువర్ణ సస్పెన్షన్

- 2019లో మధ్యాహ్న భోజనం బియ్యం పక్కదారి వ్యవహారం
- ఏడాది క్రితమే విద్యా శాఖకు విజిలెన్స్ నివేదిక
- ఇప్పుడు చర్యలు
- ఒక హెచ్‌ఎం, గుమస్తాపై కూడా సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి-1 మండల విద్యాశాఖాధికారిని, విశాఖ, భీమిలి డివిజన్ల ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో కె.సువర్ణను పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఆమె అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేస్తున్న సమయం (2019 జూన్ 17న)లో బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం పథకం కోసం ఇస్కాన్ సంస్థకు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం పక్కదారి పట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేపట్టి ఇచ్చిన నివేదిక మేరకు ఆమెపై వేటు వేశారు. అప్పటి కేడీపీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు (సర్వీస్‌లో ఉండగా మృతి చెందారు), పీఈటీ నూకరత్నంను కూడా పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను విశాఖలోని పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ రెండు రోజుల క్రితం సంబంధిత వ్యక్తుల (అప్పలనాయుడు మినహాయింపు)కు అందజేశారు. సస్పెన్షన్‌కు గురైన అధికారిణి, పీఈటీలు హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. విశాఖపట్నం, భీమిలి డిప్యూటీ డీఈవో బాధ్యతలను తాత్కాలికంగా చినగదిలి ఎంఈవో-1 రవీంద్రకు అప్పగించారు.

జీవీఎంసీ పరిధిలో 149 పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టే బాధ్యతను ఇస్కాన్, అక్షయపాత్రకు అప్పగించారు. అయితే 2019 జూన్ 17న ఇస్కాన్ సంస్థకు రవాణా చేసే బియ్యం పక్కదారి పట్టినట్టు అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా ఉండే సువర్ణ నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఆమెకు అప్పటి డీఈవో షోకాజ్ జారీచేశారు. అందుకు ఏడాది ముందు మెమో జారీచేశారు. కాగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారించి గత ఏడాది సెప్టెంబరు 13న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక మేరకు పాఠశాల విద్యా శాఖ చర్యలు తీసుకునేందుకు ఏడాది సమయం పట్టింది.

ముసురు.. ముంపు


చెరువును తలపిస్తున్న అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్ ఆవరణ

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి జిల్లాలో పలు రోడ్లు, ఆర్టీసీ కాంప్లెక్సులు చెరువులను తలపిస్తున్నాయి. పలు చెరువుల పొర్లుకట్లు పారుతున్నాయి. పలుచోట్ల వరి పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో నీరు చేరింది. వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.


పరవాడ పెద్ద చెరువు పొర్లుకట్ట పైనుంచి ఉధృతంగా పారుతున్న నీరు


నర్సీపట్నం 22వ వార్డులో రోడ్డుపై మోకాళ్ల లోతు మేర పారుతున్న నీరు


రాంబిల్లి మండలం అప్పన్నపాలెం కాలనీ జంక్షన్ వద్ద కాలువను తలపిస్తున్న నేవీ రోడ్డు


కోటవురట్ల ఎంపీడీవో ఆఫీసు ఎదురుగా మెయిన్‌రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

▸ నేర సమీక్షలో ఎస్పీ దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను అదుపు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలద్వారా నిఘాను కొనసాగించాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎస్పీ కార్యాల యంలో జరిగిన నెలవారీ నేరాల సమీక్షలో ఆమె మాట్లాడారు. పోలీసు స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ఇతరత్రా ప్రాపర్టీ రికవరీ కేసుల విచారణ వేగవంతం కావాలన్నారు. 174 సీఆర్‌పీసీ కేసులు, గంజాయి కేసులతోపాటు మిస్సింగ్ కేసులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమీక్ష జరిపారు. కేసుల విచారణ విషయంలో సంబంధిత ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కేసులపై ఎస్పీ ఆరా తీశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై విరిగి పడిన కొండ చరియలు


ఇంటిపై పడిన కొండ చరియలు

కోటవురట్ల, ఆగస్టు 31: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పందూరులో కొండ చరియలు విరిగిపడి ఒక ఇళ్ల పాక్షికంగా దెబ్బతింది. గ్రామానికి చెందిన మామిడి లక్ష్మి ఊరకొండపై రైతు భరోసా కేంద్రం పక్కనే శ్లాబ్ ఇళ్లు నిర్మించుకుంది. ఈ నేపథ్యంలో తాజా వర్షాలకు ఊర కొండ పైనుంచి శనివారం సాయంత్రం కొండచరియలు విరిగి పడి మామిడి లక్ష్మి ఇంటిని ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణపాయం జరగలేదు. ఇంటి గోడ పాక్షికంగా దెబ్బతింది.

ఇద్దరికీ హెల్మెట్ తప్పనిసరి

▸ నేటి నుంచి కొత్త నిబంధన అమలు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇకపై ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాల్సిందే. లేనిపక్షంలో పోలీసులు కేసు నమోదుచేస్తారు. వాహనం నడుపుతున్న వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలకు రవాణా శాఖ అధికారులకు పంపించేస్తారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఆదివారం నుంచి నగరంలో అమలు చేస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సెప్టెంబరు ఒకటి నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు ప్రయాణిస్తే ఇద్దరూ విధిగా ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్‌ను ధరించాల్సి ఉంటుందన్నారు. హెల్మెట్ పెట్టుకోని పక్షంలో రూ.135 ఈ-చలాన్ జారీచేయడంతోపాటు వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుని రవాణా శాఖ అధికారులకు పంపిస్తామన్నారు.

ఎసెన్షియా మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ


మూలజంపలో సన్యాసినాయుడు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

అచ్యుతాపురం/రాంబిల్లి/ఎస్.రాయవరం, ఆగస్టు 31: అచ్యుతాపురం సెజ్‌లో గల ఎసెన్షియా కర్మాగారం ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులకు శనివారం వైసీపీ నేతలు పరిహారం చెక్కులను అందజేశారు. అచ్యుతాపురం మండలం మోటూరు పాలెంకి చెందిన మృతుడు పూడి మోహన్, వాశెట్టిపాలెం గ్రామస్థులు చిన్నారావు, రాంబిల్లి మండలం మూలజంపకు చెందిన సన్యాసినాయుడు, ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడికి చెందిన జవ్వాది చిరంజీవి, బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన పూసర్ల వెంకటసాయి కుటుంబ సభ్యులకు ఐదు లక్షల చొప్పున చెక్కులను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబు రాజు, కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చీడిగుమ్మల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

▸ జిల్లా కలెక్టర్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం

▸ శతశాతం పింఛన్ల పంపిణీ చేయకుంటే చర్యలు


చీడిగుమ్మలలో పింఛన్ పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ ఆగస్టు 31: శతశాతం పింఛన్ల పంపిణీ సాయంత్రంలోగా జరగాలని.. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం మండలంలోని చీడిగుమ్మలలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ వద్ద గ్రామ కార్యదర్శి ఆర్‌వీసత్యనారాయణ అందుబాటులో లేకపోవడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి అతడిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఈ విషయమై విచారణ చేయాలని ఆర్డీవో జయరాం, ఎంపీడీవో డేవిడ్‌రాజులను ఆదేశించారు.

అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీ సాయంత్రంలోగా నూరుశాతం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. పింఛన్ల కోసం సెప్టెంబరు 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. చీడిగుమ్మల పీహెచ్‌సీ ఇరుకు గదుల్లో నిర్వహణపై టీడీపీ నేతలు స్పీకర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన గ్రామ సచివాలయ భవనంలో పీహెచ్‌సీని నిర్వహించాలని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జె.ప్రశాంతిని ఆదేశించారు. గ్రామంలో దళితుల శ్మశానం అభివృద్ధికి రూ.పది లక్షలు, దూళిపేటలో రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ధనుంజయ్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నేతలు భీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, కొల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

బోగస్ పింఛన్లపై త్వరలోనే నిర్ణయం

▸ వైసీపీ హయాంలో అడ్డగోలుగా అనర్హులకు పింఛన్లు

▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


వెంకన్నపాలెంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎంపీ రమేశ్, పక్కన ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 31: వైసీపీ పాలనలో అడ్డగోలుగా అనర్హులకు మంజూరు చేసిన పింఛన్లపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. శనివారం మండలంలోని వెంకన్నపాలెంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనర్హులకు, వైకల్యం లేని వారికి పింఛన్లు మంజూరు చేశారన్నారు. దీనిపై సర్వే చేసి బోగస్‌లను ఎలా తొలగించాలనేదానిపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందన్నారు. వైసీపీ హయాంలో అనర్హులైన వికలాంగులకు నాటి ప్రభుత్వం తీసుకుని వచ్చిన వత్తిడి మేరకు డాక్టర్లు అడ్డగోలుగా సర్టిఫికెట్లు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయం సిబ్బంది సహకారంతో నిరాటంకంగా లబ్ధిదారులకు పింఛన్లు అందించగలుగుతున్నామన్నారు. అంతకు ముందు వెంకన్నపాలెం జంక్షన్‌లో సీఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, టీడీపీ మండల అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, తెలుగుయువత నాయకులు దేవర రవికుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందుగానే పింఛన్ల పండగ

▸ హోం మంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట, ఆగస్టు 31: రాష్ట్రంలో ఒకరోజు ముందుగానే పింఛన్ల పండగ వచ్చిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం పట్టణంలోని బృందావనం కాలనీలో పలువురు పింఛనుదారుల ఇళ్లకు ఆమె వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం వచ్చినందున అధికారులెవరూ ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్లను ఒకరోజు ముందుగానే అందజేస్తున్నారన్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు.

వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని, లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ సాంబశివరావు, తహసీల్దారు జయప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, బీజేపీ నాయకుడు వేముల వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో డిగ్రీ కళాశాల అభివృద్ధి : అయ్యన్న


కంప్యూటర్ ల్యాబ్‌ని పరిశీలిస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 31 : సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్లు, సెమినార్ హాల్ పోడియం, సౌండ్ సిస్టం, కుర్చీలు, సైకిల్ షెడ్ మరమ్మతులు, జిమ్ నిర్మాణానికి కృషి చేస్తానని స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. రాజు ఆయనతో మొక్క నాటించారు. అక్కడ కంప్యూటర్ ల్యాబ్‌ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

15 మంది సీఐల బదిలీ

▸ విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్ పరిధిలో 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ గోపినాథ్ జట్టి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

వరుస నంబర్/పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న చోటు	బదిలీ అయిన స్థానం
1. పి.పైడపునాయుడు	రేంజ్ వీఆర్	కె.కోటపాడు
2. నమ్మి గణేష్	అనకాపల్లి పీసీఆర్	అచ్యుతాపురం యూపీఎస్
3. ఎం.బుచ్చిరాజు	అచ్యుతాపురం యూపీఎస్	రేంజ్ వీఆర్
4. బి.చిన్నస్వామినాయుడు	కె.కోటపాడు	శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్
5. ఎం.వినోద్‌బాబు	రేంజ్ వీఆర్	అనకాపల్లి సోషల్ మీడియా సైబర్‌సెల్
6. ఎల్.రేవతమ్మ	సిటీ నుంచి రేంజ్ వీఆర్	నర్సీపట్నం రూరల్
7. డి.దీనబంధు	రేంజ్ వీఆర్	పాడేరు యూపీఎస్
8. డి.నవీన్‌కుమార్	పాడేరు యూపీఎస్	ఏఎస్ఆర్ జిల్లా సీసీఎస్
9. వెలగాడ శంకరనారాయణ	ఏఎస్ఆర్ జిల్లా సీసీఎస్	రేంజ్ వీఆర్
10. ఎస్.బాలసూర్యారావు	పరవాడ యూపీఎస్	అనకాపల్లి డీఎస్‌బీ-1
11. ఆర్.మల్లికార్జునరావు	రేంజ్ వీఆర్	పరవాడ యూపీఎస్
12. వి.చక్రధరరావు	సిటీ నుంచి రేంజ్ వీఆర్	విజయనగరం డీసీఆర్‌బీ
13. బెండి వెంకటరావు	రేంజ్ వీఆర్	విజయనగరం టాస్క్‌ఫోర్స్
14. జి.అప్పన్న	నక్కపల్లి	పాయకరావుపేట యూపీఎస్
15. జి.అశోక్‌కుమార్	రేంజ్ వీఆర్	అనకాపల్లి రూరల్

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే పలు డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన గడువును పొడిగించారు. వాస్తవానికి శనివారంతో ఫీజులు చెల్లించేందుకు గడువు ముగిసింది. సర్వర్ కూడా సరిగ్గా పని చేయకపోవడంతో వందలాది మంది విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరలేక పోయారు.

ఈ విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతోపాటు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్ గడువు తేదీని పొడిగిస్తున్నట్టు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అకడమిక్ ఇయర్ కోర్సుల్లో చేరే విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించకుండా నవంబరు 15 వరకు ఫీజులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

▸ జిల్లాలో సబ్బవరం మొదటి స్థానం


బాటజంగాలపాలెంలో పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, ఆగస్టు 31: మండలంలో శనివారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాటజంగాపాలెంలో కొంతమంది పింఛనుదారులకు ఆమె సొమ్మును అందజేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేశ్‌నాయుడు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం పింఛన్లు 8,206 ఉండగా 7,915 మందికి పంపిణీ చేసి 96.45 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంకటరమణ, ఈవోపీఆర్డీ మహేశ్, వెలుగు ఏపీఎం సాయిరమేశ్, సిబ్బంది విజయ పాల్గొన్నారు.

వీధి వీధిన పింఛన్ల పంపిణీ పండగ



అనకాపల్లి పింఛన్ల పంపిణీలో కొణతాల, పీలా

అనకాపల్లి టౌన్/కశింకోట, ఆగస్టు 31 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని చేపట్టారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలు శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పింఛన్లు పంపిణీ చేపట్టారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట మండలం కన్నూరుపాలెంలో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే కొణతాల ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ తదితర కూటమినేతలు పాల్గొన్నారు.

వదలని వాన

▸▸ వాయుగుండంతో అన్ని మండలాల్లో కుండపోత ▸▸ లోతట్టు ప్రాంతాలు జలమయం ▸▸ అవస్థలు పడిన జనం



నక్కపల్లి : జానకయ్యపేట వరి పొలాల్లో వర్షపునీరు





చెరువును తలపిస్తున్న ఎలమంచిలిలోని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానం.., పాయకరావుపేట అంబేడ్కర్ కాలనీలో...



అచ్యుతాపురం ప్రధాన జంక్షన్‌లో...



ఎస్. రాయవరం మండలం ధర్మవరం అగ్రహారంలో...

అనకాపల్లి టౌన్, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా పలు మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి అడపా దడపా చినుకులు పడుతున్నా.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అనకాపల్లి పరిసర మండలాల్లో కుండపోతగా పడడంతో లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. అనకాపల్లిలో 30.0 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించేలా నీరు నిలిచిపోయింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనచోదకుల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాయకరావుపేట : అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పాయకరావుపేటలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 55.6 మి.మీ. వర్షపాతం నమోదవగా, పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. పంచాయతీ కాలువల్లోని మురుగునీరు వర్షపునీటితో కలిసి రోడ్లపైకి చేరింది.

నక్కపల్లి : తుపాన్ ప్రభావంతో మండలంలో కుండపోతగా వర్షం కురుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కురిసిన ఈ వర్షాలు వరికి ఊపిరిపోశాయి. వరి పొలాలు వర్షపు నీటితో కళకళలాడుతూ కన్పిస్తున్నాయి. సీహెచ్‌ఎల్‌పురం, పెదతీనార్ల, చినతీనార్ల, చినదొడ్డిగల్లు, వేంపాడు, కాగిత, ఉపమాక , గుల్లిపాడు గ్రామాల్లోని రహదారులపై నీరు ప్రవహించింది.

కోటవురట్ల : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వరహా, సర్పా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శనివారం తెల్లవారు జామున నుంచి ఉరుములు మెరుపులతో భారీవర్షం పడింది. అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పొలాల్లో భారీగా నీరు చేరింది. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

ఎస్.రాయవరం : మండలంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా పడడంతో పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో గల జగనన్న కాలనీల్లో వర్షపు నీరు చేరడంతో నివాసితుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మండలం వ్యాప్తంగా 33.6 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు తాహసీల్దార్ విజయకుమార్ తెలిపారు.

పరవాడ : మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా వర్షాలు పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మండల వ్యాప్తంగా 64.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వ్యవసాయాధికారిణి సీహెచ్. చంద్రావతి తెలిపారు. మండల కేంద్రం పరవాడలోని కొన్నిచోట్ల వరి పొలాలు నీట మునిగాయి.

ఎలమంచిలి : అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఎలమంచిలి పట్టణంలోని ప్రధాన, రోడ్డులో గల ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్, పాత ఆస్పత్రి జంక్షన్, రాజీవ్ గాంధీ క్రీడామైదానం చెరువులను తలపిస్తున్నాయి. డ్రైన్లలోకి మురుగునీరు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి.

అచ్యుతాపురం : మండలంలో గత రెండు రోజులుగా ముసురు వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు 67.6ఎంఎం, శనివారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 వరకు 44.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. ఇక్కడి జంక్షన్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నుంచి పారడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాంబిల్లి : మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో ఎటుచూసినా నీరే కనిపిస్తోంది. ప్రధానంగా వెంకటాపురం నుంచి వాడనర్సాపురం సమీపంలోని నేవీకి వేళ్లే రోడ్డు దారుణంగా తయారైంది. ఎక్కడికక్కడ గోతుల మయం కావడంతో వాటిలో నీరు చేరి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 48.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మునగపాక : అల్పపీడనం కారణంగా మండలంలో గత రెండుమూడు రోజులుగా వర్షారు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. పంట పొలాల్లో నీరు చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలో చెరకు సాగు సాధారణ విస్తీర్ణం 1300 హెక్టార్లు కాగా, ఈ ఏడాది 600 హెక్టార్లలో సాగు జరుగుతుందని ఏవో జోత్న్స తెలిపారు.

రిటైర్డు ఎంఈవోలకు సన్మానం



పదవీ విరమణ పొందిన మూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఆగస్టు 31 : ఎస్.రాయవరం ఎంఈవో-2గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఎస్‌ఎన్ మూర్తిని శనివారం అంతా ఘనంగా సత్కరించారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యా శాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఈవో మూర్తి నిబద్ధత, అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. విజయనగరం డీఈవో ప్రేమకుమార్, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, ఏపీటీఎఫ్, ఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ధర్మారావు, గోపీనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, నాయకులు సుంకర శ్రీనివాసరావు, బండి నాగేశ్వరరావు, సియ్యాదుల షెడ్రక్, ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నగిరెడ్డి ఆదినారాయణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : ఇక్కడి ఎంఈవో-1గా పనిచేసిన కొట్నాల చిట్టిబాబు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ముఖ్య అతిథిగా హాజరై చిట్టిబాబు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 మూర్తి, జేఏసీ సభ్యులు నేమాల రమణ, కె.సూర్యనారాయణ, రమేష్‌రావు, పల్లా బాబ్జి, డీఎస్ మల్లేశ్వరరావు, ఆచంట రవి తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితకు వినతుల వెల్లువ

నక్కపల్లి, ఆగస్టు 31 : హోం మంత్రి వంగలపూడి అనితను శనివారం ఉదయం నక్కపల్లికి సమీపంలో ఉన్న తన నివాసం వద్ద పలు ప్రభుత్వ శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు కలిశారు. అనేక సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు. కూటమి నాయకులు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రధాన సమస్యలను ఆమెకు దృష్టికి తీసుకు వెళ్లారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

పరవాడ, ఆగస్టు 31 : బహిరంగ ప్రదేశాల్లో వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పరవాడ సీఐ బాలసూర్యారావు ఒక ప్రకటనలో సూచించారు. పందిళ్ల ఏర్పాటు చేసుకునే వారు మీ-సేవాలో చలానా తీసి దరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తామని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

ఎలమంచిలి, ఆగస్టు 31 : బీజేపీ సభ్యత్వ నమోదును లక్ష్యాన్ని మించి చేయాలని ఆ పార్టీ బూత్ కమిటీ అధ్యక్షుడు పప్పు ఈశ్వరరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు శనివారం 21వ వార్డులో బూత్ కమిటీల అధ్యక్షులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సోమవారం ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నాయకులు బొద్దపు శివ, ఆలేటి నానాజీ, అప్పలరాజులు తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలపై వినతి

కొత్తూరు, ఆగస్టు 31 : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్స్‌కు ఉద్యోగభద్రత కల్పించాలని అనకాపల్లి ఈఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం మీటర్ రీడర్స్ యూనియన్ అధ్యక్షుడు శంకరరావు పాత్రో, కార్యదర్శి శ్రీనివాసరావు కలిసి సమస్యలు వివరించారు.

'సంచార జాతుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

సబ్బవరం, ఆగస్టు 31 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచార జాతులకు గుర్తింపు టీడీపీ హయాంలోనే వచ్చిందని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన సంచార జాతుల 72వ విముక్తి దినోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంచార జాతులైన బేడ, బుడగ జంగాలు, గంగిరెద్దుల వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీసీ-ఎలో ఉన్న సంచార జాతులను ఎస్టీల్లో చేర్చడంతో పాటు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీటీసీ చైతన్య, బంతికోళ్ల పద్మ, గండి దేముడు, ఏపీ ఎంబీసీ కన్వీనర్ పెంద్ర రమేశ్, గెడ్డప్ప, కమిటీ సభ్యులు ధన కొండ, జట్లయ్య, లోవ రాజు, కుమార్, చంటయ్య, గొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వుషూ పోటీల్లో అనకాపల్లికి పతకాలు

తుమ్మపాల, ఆగస్టు 31 : రాష్ట్రస్థాయి తొమ్మిదవ సీనియర్, సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వుషూ చాంపియన్‌షిప్ పోటీల్లో అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఫిట్నెస్ అండ్ బాక్సింగ్ క్లబ్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. సీనియర్ కేటగిరిలో డి.అరుణ బంగారు పతకం, ఎస్.జయంత్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. సబ్ జూనియర్స్ కేటగిరిలో ఎం.తులసి, ఈ.లక్షిత్‌లు బంగారు పతకాలను సాధించగా, ఆర్.గోవర్ధన్, బి.దుర్గప్రసాద్ రజత పతకాలను, ఎస్.గుణ కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు.

94.44 శాతం మందికి పింఛన్లు

... 3వ పేజీ తరువాయి

పాయకరావుపేటలోని బృందావనం కాలనీలో, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సబ్బవరం మండలం బాటజంగాలపాలెంలో పలువురికి పింఛన్ డబ్బులు అందజేశారు. కాగా చీడిగుమ్మలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్‌వీ సత్యనారాయణ అందుబాటులో లేకపోవడంతో అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆదేశించారు.

కుండపోత!

... 3వ పేజీ తరువాయి

ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు మునిసిపల్, పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరేలా తగిన చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అన్నదాతల్లో మోదం.. ఖేదం!

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో అత్యధిక శాతం మంది రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తుండగా, కొద్ది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులు, చెక్‌డ్యామ్‌ల కింద ఇంతవరకు వరినాట్లు వేయని రైతులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పొలాలను దమ్ము చేసి, నాట్లు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన పొలాల్లో నుంచి అధిక నీటిని బయటకు పంపుతున్నారు. కానీ లోతట్టు భూముల్లో వరినాట్లు నీట మునుగుతాయని ఆందోళన పడుతున్నారు. వంగ, మిరప, బెండ, బీర, చిక్కుడు వంటి ఉద్యాన పంటలు అధిక వర్షాలను తట్టుకోలేవని, పొలంలో ఎక్కువ రోజులు నీరు నిల్వ వుంటే మొక్కలు చనిపోతాయని చెబుతున్నారు. చెరకు, సరుగుడు, ఇతర ఉద్యాన తోటలకు వర్షం మేలు చేస్తుందంటున్నారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

▸▸ కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు



మంగవరం పీహెచ్‌సీలో జ్వరంతో ఆస్పత్రిలో చేరిన రోగులు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 31 : మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. సత్యవరం, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట, శ్రీరాంపురం, మాసాహెబ్‌పేట తదితర గ్రామాల్లో ప్రజలు జ్వరం, కీళ్లనొప్పులతో తీవ్రంగా బాధపడుతున్నారు. వాతావరణం మారడంతో వైరల్ ఫీవర్లు సోకుతున్నాయి. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే అందరికీ వ్యాపిస్తున్నాయి. జ్వరం తగ్గినా కీళ్ల నొప్పులు మాత్రం వదలడం లేదని అంటున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గిన తరువాత పది నుంచి పదిహేను రోజుల వరకు నడవలేక పోతున్నారు. కొంతమందికి ఒంటిపై దద్దుర్లు, ముఖంపై మచ్చలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టి దోమల మందును పిచికారీ చేయాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

వాడీవేడిగా 'పట్నం' కౌన్సిల్ సమావేశం

... 3వ పేజీ తరువాయి

చూపించారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, కౌన్సిలర్ సౌజన్య ఇచ్చిన ఆధారాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

పురపాలక సంఘం మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మాట్లాడుతూ, 17వ వార్డులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 10 మంది లబ్ధిదారుల పెన్షన్లను రాజకీయ కక్షతోనే తొలగించారని ఆరోపించారు. టీడీపీ కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో అర్హుల పెన్షన్లు తీసేయడం జరగదని అన్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకు వెళ్లి పెన్షన్లు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని పద్మావతి హామీ ఇచ్చారు. టీడీపీ కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో 650 మంది పెన్షన్లు రద్దు చేశారని, తాము ఆందోళన చేస్తే పునరుద్ధరించారని గుర్తు చేశారు. వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, చేపలు, మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించడం లేదని, గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. పెదబొడ్డేపల్లి శ్మశానవాటికలో కనీస సదుపాయాలు లేవని చెప్పారు. కమిసనర్ సురేంద్ర మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు మునిసిపాలిటీలోని 10 శ్మశానాలను సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి పలు కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడారని తెలిపారు.

దుర్గాలమ్మచెట్టు ఆలయంలో మంత్రి పూజలు

పాయకరావుపేట, ఆగస్టు 31 : పట్టణంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయంలో శనివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి విచ్చేసిన ఆమె బృందావనం కాలనీలో ఉన్న దుర్గాలమ్మచెట్టు ఆలయంలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం పోలీసులకు రివార్డు



సబ్బవరం, ఆగస్టు 31 : ఇక్కడి పోలీసులకు జిల్లా ఎస్పీ దీపిక రివార్డు ప్రకటించారు. ఐదు రోజుల క్రితం 912 కేజీల గంజాయిని చాకచక్యంగా పట్టుకున్నందుకు నలుగురికి రివార్డులను శనివారం అనకాపల్లిలోని ఆమె కార్యాలయంలో అం దజేశారు. సీఐ రమణ, ఎస్ఐ ధనుంజయ్, కానిస్టే బుల్ నాగేంద్ర, డ్రైవర్ నాయుడులను ప్రశంసించారు.

రహదారులు జలమయం

» తటాకాలను తలపిస్తున్న వైనం » వాహనదారులకు తప్పని ఇబ్బందులు


చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద వాహనం కదలలేని పరిస్థితి..

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, వాగులు నిండిపోయాయి. జలకళతో రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. అయితే పట్టణాలు, గ్రామాల్లో రహదారులు గోతులమయంగా ఉండడంతో అందులో వర్షం నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 'చినుకు పడితే ఇదేం బాధరా బాబూ..' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోడవరం, ఆగస్టు 31 : పట్టణంలోని ప్రధాన రహదారిలో కొత్తూరు జంక్షన్ వద్ద వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. జంక్షన్ వద్ద ఎత్తుగా వేసిన రోడ్డు వల్ల వాన నీరు రోడ్డుపైనే నిలువ ఉండిపోతోంది. రోడ్డుకు రెండువైపులా ఉన్న కాలువల్లో పూడిక పేరుకు పోవడంతో మురుగునీరు పారే పరిస్థితి లేదు. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారి ఈ జంక్షన్ గంటల తరబడి నీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మాకవరపాలెం : మండలంలో జెడ్.గంగవరం, రామన్నపాలెం, గిడుతూరు తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గోతులమయంగా మారాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లు పాడయి గోతులమయంగా తయారవుతున్నాయని స్థానికులు అంటున్నారు. కొన్నిచోట్ల నీరు చేరిన గోతుల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా జెడ్.గంగవరం, రామన్నపాలెం రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది.

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు గోతులమయంగా మారాయి. బీఎన్ రోడ్డు, కొమరవోలు రోడ్డు, వడ్డిప-శరభవరం, భోగాపురం-కొంతలం రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

బుచ్చెయ్యపేట : బీఎన్ రోడ్డులోని పెద్ద పెద్ద గోతుల్లో వర్షం నీరు చేరి తటాకాలను తలపించాయి. బంగారుమెట్ట, ఎల్.సింగవరం, పొట్టిదొర పాలెం, బూదిరెడ్ల పాలెం గ్రామాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఇటీవల బూదిరెడ్లపాలెం వద్ద భారీ గొయ్యిలను స్థానికులు గ్రావెల్‌తో నింపారు. వర్షాలకు గ్రావెల్ కాస్తా బురదమయంగా మారడంతో మొత్తం రోడ్డు పొలం దమ్ము మడిలా తయారైంది.

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు గోతులమయంగా మారాయి. గత ఐదేళ్ల నుంచి అధ్వాన్నంగా ఉన్న రోడ్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరింత దారుణంగా మారాయి. మండలంలోని బీఎన్ రోడ్డు, కొమరవోలు రోడ్డు, వడ్డిప-శరభవరం, భోగాపురం-కొంతలం రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

చీడికాడ : మండలంలోని వరహాపురం సమీపంలో ఉన్న రోడ్డుపై మొండిగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో సుమారు 10 గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వరహాపురం నుంచి పెద్ద గోగాడ గ్రామానికి వెళ్లేందుకు సుమారు 4 కిలోమీటర్ల మేర 30 ఏళ్ల కిందట తారురోడ్డును నిర్మించారు. అయితే ఈ రెండు గ్రామాల మధ్య నుంచి ప్రవహిస్తున్న గెడ్డపై కాజ్‌వే నిర్మించకపోవడంతో ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బీఎన్ రోడ్డులో చేపలు పట్టిన వామపక్ష నేతలు



రావికమతం : బీఎన్ రోడ్డులో చెరువును తలపించేలా భారీ గోతుల్లో చేరిన వర్షపు నీటిలో వామపక్షాలకు చెందిన నాయకులు, స్థానికులు చేపలు పడుతూ మొక్కలు నాటి నిరసన తెలిపారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, సీపీఐ మండల కార్యదర్శి జి.జోగిరాజుల ఆధ్వర్యంలో శనివారం కొత్తకోట జూనియర్ కళాశాల ఎదురుగా బీఎన్ రోడ్డులో పడిన భారీ గోతుల వద్ద నిరసన తెలియజేశారు. బీఎన్ రోడ్డు ఇంతకుముందు ఎన్నడూ ఇంతటి దారుణ స్థితిలో లేదన్నారు. వారం రోజుల్లో ఈ గోతులు పూడ్చకుంటే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


రోలుగుంట : కొమరవోలు రోడ్డులో గుంతలు


బురదమయంగా మారిన జెడ్.గంగవరం రోడ్డు


బుచ్చెయ్యపేట : బూదిరెడ్డిపాలెం వద్ద..

సంక్షిప్తంగా..

ఎస్ఐ దామోదర్ బాధ్యతల స్వీకారం



మాకవరపాలెం, ఆగస్టు 31 : మాకవరంపాలెం నూతన ఎస్ఐగా దామోదర్ నాయుడు శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వడ్డాది మాడుగుల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా, ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్ఐగా ఉన్న రామకృష్ణారావుకు ఇంకా ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు.

గొలుగొండ ఎస్ఐగా రామారావు



గొలుగొండ : గొలుగొండ ఎస్ఐగా పి.రామారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అన్నివేళలలా అందుబాటులో ఉంటానన్నారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణలో ముందుకు వెళతామన్నారు.

మా పింఛన్లు తొలగించారు


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

గొలుగొండ ఆగస్టు 31 : పాకలపాడు గ్రామానికి చెందిన 21 మంది దివ్యాంగులు తమ పింఛన్లు తొలగించారంటూ శనివారం ఎంపీడీవో డేవిడ్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని నాలుగేళ్లుగా పొందుతున్న దివ్యాంగులుగా పింఛన్లు ఆగస్టులో తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఎంసీ ఛైర్మన్‌గా సత్యవేణి


సత్యవేణిని అభినందిస్తున్న కూటమి నేతలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 31 : వడ్డాది కేజీబీవీ ఎస్ఎంసీ ఛైర్మన్‌గా యడ్ల సత్యవేణి, వైస్ ఛైర్మన్‌గా డొంకిన శ్రీనివాసరావుతో పాటు మరో 13 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీతో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. సత్యవేణిని కూటమి నాయకులు దొండా నరేష్, దొండా సాయి తదితరులు అభినందించారు. అలాగే కొత్త కొండెంపూడి ఎస్ఎంసీ ఛైర్మన్‌గా నేమాలా శ్రీదేవి, వైస్ ఛైర్మన్‌గా ఆది మహేష్, సీతయ్యపేట జడ్పీ హైస్కూల్ ఛైర్మన్‌గా పిల్లా మహేష్, వైస్ ఛైర్మన్‌గా తోట పద్మ ఎన్నికైనట్టు ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

జనసేన ఆధ్వర్యంలో 'క్లీన్ ఆంధ్రా'

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 31 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం నేపథ్యంలో డిగ్రీ కళాశాలలో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. నర్సీపట్నం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో తుప్పలు తొలగించారు. నర్సీపట్నం డివిజన్‌లో 50శాతం గ్రీన్‌కవర్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామని సూర్యచంద్ర తెలిపారు. ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటనున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన టౌన్ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్, రేగుబళ్ల శివ, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర

కె.కోటపాడు, ఆగస్టు 31 : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వరి పొలాలలకు ఎంతో ఉపయోగకరమని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు వి.రవీంద్ర పేర్కొన్నారు. శనివారం మండలంలోని వారాడ, వి.సంతపాలెం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఇప్పటి వరకూ ఎటువంటి పంట నష్టం లేదని, పంట పొలాలు బాగున్నాయని అన్నారు. ఇక పై అధిక వర్షాలు కురిస్తే రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరి పంటలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చిన్న చిన్న నీటి కాలువలు తీసుకుని అదనపు నీటిని బయటకు పంపాలన్నారు. అధిక వర్షాల వల్ల ఎక్కడైనా పంట నష్టం సంభవిస్తే గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. అలాగే వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారి సోమశేఖర్, స్నేహ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదానం రేపు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 31 : గొలుగొండ మండలం పాత కృష్ణాదేవిపేటలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ ఉప సర్పంచ్, జనసేన సీనియర్ నాయకులు దుంపలపూడి సహదేముడు తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన నాయకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, యువత పాల్గొని జయప్రదం కావాలని కోరారు.

అప్రమత్తత అవసరం : ఆర్డీవో

» రైవాడ జలాశయం పరిశీలన

దేవరాపల్లి, ఆగస్టు 31: అల్పపీడనం ప్రభావంతో వర్షాలు ఎక్కువ పడే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవో చిన్నికృష్ణ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, జిల్లా కలెక్టరు విజయ్‌కృష్ణన్ ఆదేశించడంతో శనివారం జలాశయాన్ని పరిశీలించామన్నారు. ఏఈఈ నరేషుని జలాశయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 108.15 మీటర్లు ఉందన్నారు. ఇన్‌ఫ్లో 365 క్యూసెక్కులు చేరుతుందన్నారు. ఆయన వెంట ఆర్ఐ.సతీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య అతిథిగా పిలిచి అవమానించారు

» మునిసిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి ఆవేదన



నర్సీపట్నం, ఆగస్టు 31 : వనమహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిలిచి తనను తీవ్రంగా అవమాన పరిచారని మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అటవీశాఖ అధికారులు నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం తనను ముఖ్య అతిథిగా పిలిచి జనసేన ఇన్‌చార్జ్ సూర్యచంద్రతో నాటించి అవమాన పరిచారన్నారు. జనసేన నాయకుడు సూర్యచంద్ర ప్రతీ విషయంలో అడ్డుతగులుతూ కార్యక్రమాన్ని తన కనుసన్నల్లో నడిపించారని ఛైర్‌పర్సన్ ఆరోపించారు. ఈ విషయమై అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఒక దళిత మహిళగా కాకున్నా ఛైర్‌పర్సన్ కుర్చీకైనా గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ వీర మాచినేని జగదీశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వూషూ టోర్నమెంట్‌లో పతకాలు

నర్సీపట్నం, ఆగస్టు 31 : రాజమహేంద్రవరం ఫారెస్ట్ కల్యాణ మండపంలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ వూషూ టోర్నమెంట్‌లో వేపాల ప్రియాంక (75 కిలోలు) బంగారు పతకం, ఉలం రవికుమార్ (70 కిలోలు) రజత పతకాలు సాధించారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. వూషూ రిఫరి వెంకటేశ్, ఏపీ వూషూ అసోసియేషన్ ఫౌండర్ మోహన్ అభినందించారు.

నీటి నిల్వల్లో గంబూషియా చేపల విడుదల

చీడికాడ/ గొలుగొండ, ఆగస్టు 31 : దోమల నివారణ చర్యల్లో భాగంగా చిన్న చిన్న నీటి కుంటల్లో గంబూషియా చేప పిల్లలను చీడికాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం అప్పలరాజుపురం, కండివరం గ్రామాల్లో నీటి కుంటల్లో వదిలివేశారు. హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, ఏఎన్ఎం భవానీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో గల చెరువులు, నీటి గుంటల్లో దోమల నివారణకు నిల్వనీటిలో గంబూషియా చేప పిల్లలు శనివారం వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రఘరాం, తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం


ఏఎల్ పురంలో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం, ఆగస్టు 31 : నర్సీపట్నంలో శనివారం తెల్లవారు జామున మొదలైన వర్షం ఉదయం తొమ్మిది గంటలు వరకు తెరిపిలేకుండా కురిసింది. మధ్యాహ్నం కొద్దిసేపు ఎండకాచింది. రెండు గంటల తర్వాత మళ్లీ సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెయిన్ రోడ్డు, వెంకునాయుడు పేట స్కూలు రోడ్డు, బ్యాంక్ కాలనీ, శివపురం తదితర ప్రాంతాలలో డ్రైనేజీ నీరు రోడ్లు మీద పారింది.

చోడవరం : అల్పపీడన ప్రభావంతో శనివారం మధ్యాహ్నం నుంచి జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసినా, శనివారం ఉదయానికి తిరిగి వాతావరణం మామూలుగానే ఉంది. తిరిగి శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సుమారు గంట పాటు భారీగా వర్షం కురిసింది. తరువాత నుంచి రాత్రివరకూ వర్షం పడుతూనే ఉంది.

రోలుగుంట : మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షంకురిసింది. తెల్లవారుజామున ప్రారంభమై సాయంత్రం వరకు పడింది. దీంతో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షానికి అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెట్టు ప్రాంతాల పంటలకు మంచి అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల : మాడుగుల కేంద్రంలో శనివారం సాయంత్రం గంటపాటు కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం నెలకొని తేలిక జల్లులు కురిశాయి. సాయంత్ర నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు వ్యవసాయ పంట పొలాల్లోకి నీరు చేరింది. అక్కడక్కడ చెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి.

రావికమతం : మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షానికి చెరువులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల వర్షం నీరు రోడ్డుపైకి రావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కల్యాణపులోవ రిజర్వాయర్ 460 అడుగుల సామర్థ్యం కాగా ప్రస్తుత నీటి మట్టం 459 అడుగులకు చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడిచి పెడుతున్నట్టు ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు.

గొలుగొండ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో గెడ్డలు పొంగి ప్రవహించాయి. మండలంలోని జోగంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, పాకలపాడు, గుండుపాల, కొమిర, రావణాపల్లి, ఏటిగైరంపేట, పప్పుశెట్టిపాలెం, కొత్తఎల్లవరం గ్రామాల్లో తుఫాను కారణంగా భారీ వర్షం కురిసింది. దీంతో పాతమల్లంపేటలో దారగెడ్డ, పాలగెడ్డ, గొరిగెడ్డ, పాలగెడ్డ పొంగి ప్రవహించాయి. దీంతో జోగంపేట గ్రామంలో గల మధాలపై గెడ్డల నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు పలు ఇబ్బందులు పడ్డారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్ పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఉదయం నుంచి పలుమార్లు కుండపోత వర్షం పడింది. కృష్ణాదేవిపేట-కొంగసింగి రహదారిలో తారురోడ్డుపై, కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వర్షం నీరు చేరింది. చెరువులు, బొడ్డేరు గెడ్డలు నీటితో కళకళలాడుతున్నాయి.

7 నుంచి స్వయంభూ వినాయక ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఆగస్టు 31 : స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయం నవరాత్రి ఉత్సవాలను 7 నుంచి ఘనంగా నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో ఎస్వీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పెదబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, అర్చకులు కొడమంచిలి చలపతి, పి.జయదేవ్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిల్లా దాటి వెళ్లి పింఛన్ అందజేత


తూ.గో.జిల్లా వెళ్లి పింఛన్ అందజేస్తున్న దుర్గాప్రసాద్

మాకవరపాలెం, ఆగస్టు 31 : పింఛన్ల పంపిణీలో అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. మండలంలో బూరుగుపాలెం గ్రామానికి చెందిన మేరపు రెడ్డి కుమారి అనారోగ్యంతో బాధ పడుతూ ఇటీవల తూర్పు గోదావరి జిల్లా కోటనందూరులోని తమ బంధువుల ఇంటి వద్ద ఉంటున్నారు. శనివారం పింఛన్లు చేపట్టిన అనకాపల్లి దుర్గాప్రసాద్.. ఆమె ఉంటున్న కోటనందూరు వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో అయనను ఎంపీడీవో సీతామహాలక్ష్మి అభినందించారు. మండలంలో 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.



ఉద్రిక్తత నడుమ ఎస్ఎంసీ ఎన్నిక

బుచ్చెయ్యపేట, ఆగస్టు 31: యూపీ స్కూల్ ఎస్ఎంసీ ఎన్నిక ఉద్రిక్తత నడుమ సాగింది. ఈ నెల 17న జరగాల్సిన ఈ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది. శనివారం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా హెచ్ఎం కె.సుగుణాకర్ వ్యవహరించారు. అయితే 11 గంటల వరకు తల్లిదండ్రులు స్కూలుకు రాకపోవడంతో హెచ్ఎం కోరం లేదనందుకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, పార్టీ అనుయాయులు 37 మంది విద్యార్థుల తల్లిదండ్రులను స్కూలుకు తీసుకొచ్చి ఎన్నికను నిర్వహించాలని కోరారు. ఎన్నిక వాయిదా వేసినట్టు హెచ్ఎం తెలపడంపై కోటేశ్వరరావు అభ్యంతరం తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉండగా ఎలా వాయిదా వేస్తారంటూ నిలదీశారు.

మరోవైపు వాయిదా వేసినట్టు ప్రకటించిన తర్వాత ఎన్నిక నిర్వహిస్తే ఒప్పుకునేది లేదంటూ సర్పంచ్, వైసీపీ నాయకుడు గోకివాడ వరకృష్ణ పట్టుపడ్డారు. ఈ నైపథ్యంలో ఇరు పార్టీల నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం కల్పించుకున్నప్పటికీ పరిస్థితి సద్దుమణగలేదు. ఈ సమయంలో హెచ్ఎం సుగుణాకర్ స్పృహ కోల్పోయారు. ఆమెను పోలీసు జీపులో తురకలపూడి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కోరం ఉన్నందున ఎన్నిక జరిపించాలని కోరుతూ కోటేశ్వరరావు ఎంఈవో-1, 2లు బొంజుబాబు, కాశీ విశ్వేశ్వరరావును ఫోన్ ద్వారా కోరారు. దీంతో ఇద్దరు ఎంఈవోలు పెదపూడి స్కూలుకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కోరం సరిపోయినందున ఎన్నిక నిర్వహించాలని ఎంపీవోలు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సర్పంచ్ వర్గీయులు వ్యతిరేకించారు. ఎట్టకేలకు నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలో ఛైర్మన్‌గా ఉండాల రమణ, వైస్ ఛైర్మన్‌గా ఎ.లక్ష్మి ఎన్నికైనట్టు ఎంఈవోలు బొంజుబాబు, కాశీవిశ్వేశ్వరరావు ప్రకటించారు.

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ


కె.కోటపాడు : పింఛను అందజేస్తున్న ప్రత్యేకాధికారి నాగమణి

నర్సీపట్నం, ఆగస్టు 31 : మునిసిపాలిటీలో జోరు వానను సైతం లెక్క చేయకుండా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ నిర్వహించారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచి సచివాలయ సిబ్బంది గడప గడపకు వెళ్లి లబ్ధిదారులను పింఛను సొమ్ము అందజేశారు. 17 సచివాలయాల పరిధిలో 7,175 మంది లబ్ధిదారులకు రూ.3.10 కోట్లు మంజూరు కాగా సాయంత్రానికి 94.93 శాతం పంపిణీ చేశారు. పింఛన్లు పింపిణీ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు చింతకాయల రాజేశ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్ : మండలంలోని తొమ్మిది సచివాలయల పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ 97 శాతం పూర్తి చేశామని ఎంపీడీవో జయమాదవి తెలిపారు. శనివారం తెల్లవారు జామునుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారని తెలిపారు. పింఛన్లు పంపిణీలో చురుగ్గా పని చేసిన సచివాలయ సిబ్బందిని ఆమె అభినందించారు.తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు మూడో తేదీ సోమవారం పింఛన్లు అందజేస్తామని తెలిపారు.

కె.కోటపాడు : మండలంలో 90 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి చేసినట్లు మండల ప్రత్యేక అధికారిణి నాగలక్ష్మి తెలిపారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు శనివారం తెల్లవారుజాము నుంచి పంపిణీ చేపట్టారు. ఉదయం పది గంటలకు 88 శాతం పూర్తి చేసి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందని స్పెషల్ ఆఫీసర్ తెలిపారు.

మాడుగుల రూరల్ : మండలంలో శనివారం శనివారం 11,059 మందికి. రూ.4,79,78,000 పింఛన్లు పంపిణీ చేశారు. రోజంతా మోస్తరు వర్షం పడుతున్నా సచివాలయ సిబ్బంది నేరుగా పింఛన్లు అందజేశారు.



94.44 శాతం మందికి పింఛన్లు

... 3వ పేజీ తరువాయి

పాయకరావుపేటలోని బృందావనం కాలనీలో, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సబ్బవరం మండలం బాటజంగాలపాలెంలో పలువురికి పింఛన్ డబ్బులు అందజేశారు. కాగా చీడిగుమ్మలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్‌వీ సత్యనారాయణ అందుబాటులో లేకపోవడంతో అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆదేశించారు.

కుండపోత!

... 3వ పేజీ తరువాయి

ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు మునిసిపల్, పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరేలా తగిన చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అన్నదాతల్లో మోదం.. ఖేదం!

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో అత్యధిక శాతం మంది రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తుండగా, కొద్ది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులు, చెక్‌డ్యామ్‌ల కింద ఇంతవరకు వరినాట్లు వేయని రైతులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పొలాలను దమ్ము చేసి, నాట్లు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన పొలాల్లో నుంచి అధిక నీటిని బయటకు పంపుతున్నారు. కానీ లోతట్టు భూముల్లో వరినాట్లు నీట మునుగుతాయని ఆందోళన పడుతున్నారు. వంగ, మిరప, బెండ, బీర, చిక్కుడు వంటి ఉద్యాన పంటలు అధిక వర్షాలను తట్టుకోలేవని, పొలంలో ఎక్కువ రోజులు నీరు నిల్వ వుంటే మొక్కలు చనిపోతాయని చెబుతున్నారు. కాగా చెరకు, సరుగుడు, ఇతర ఉద్యాన తోటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని అధికారులు అంటున్నారు.

వాడీవేడిగా 'పట్నం' కౌన్సిల్ సమావేశం

... 3వ పేజీ తరువాయి

చూపించారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, కౌన్సిలర్ సౌజన్య ఇచ్చిన ఆధారాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మాట్లాడుతూ, 17వ వార్డులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 10 మంది లబ్ధిదారుల పెన్షన్లను రాజకీయ కక్షతోనే తొలగించారని ఆరోపించారు. టీడీపీ కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో అర్హుల పెన్షన్లు తీసేయడం జరగదని అన్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకు వెళ్లి పెన్షన్లు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని పద్మావతి హామీ ఇచ్చారు. టీడీపీ కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో 650 మంది పెన్షన్లు రద్దు చేశారని, తాము ఆందోళన చేస్తే పునరుద్ధరించారని గుర్తు చేశారు. వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, చేపలు, మాంసం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించడం లేదని, గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. పెదబొడ్డేపల్లి శ్మశానవాటికలో కనీస సదుపాయాలు లేవని చెప్పారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు మునిసిపాలిటీలోని 10 శ్మశానాలను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి పలు కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడారని తెలిపారు.